క్లుప్తంగా

జ్ఞాపికలు అందజేత



జి కొండూరు: విద్యార్థి దశ నుంచి క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలని సినీ నటుడు అంబటి అర్జున్‌రెడ్డి అన్నారు. స్థానిక శాగం శివరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన క్రీడా వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడల్లో రాణించిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అర్జున్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీలత, పీడీ సీజర్‌రెడ్డి, పీఈటీ మాధవరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉయ్యూరు వెంకట నర్సింహారావు పాల్గొన్నారు.

సీపీఐ ప్రచార యాత్ర



జి.కొండూరు: భారత రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నియంత పాలనను గుర్తు చేస్తున్నారని, దీనిని ప్రజలంతా వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. బీజేపీ పాలన నుంచి రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ప్రచార యాత్రను శుక్రవారం చెవుటూరులో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఎల్బీఆర్సీఈ అధ్యాపకురాలికి పీహెచ్‌డీ ప్రదానం



మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఫ్రెష్‌మెన్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకురాలు శ్రీలక్ష్మీ మానస ధరణికోటకు పీహెచ్‌డీ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు శుక్రవారం తెలిపారు. జయోతి విద్యాపీఠం ఉమెన్స్ యూనివర్సిటీలో ఇంగ్లిష్ విభాగంలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీని ప్రదానం చేశారని చెప్పారు. అధ్యాపకురాలిని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఫ్రెష్‌మెన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎ.రామిరెడ్డి తదితరులు అభినందించారు.

బాల్య వివాహాలు చేయవద్దు



ఆంజనేయపురం(తిరువూరురూరల్): మైనర్ బాలికలకు వివాహం చేయవద్దని, చట్టప్రకారం 18 సంవత్సరాలు నిండే వరకు ఆడపిల్లలకు పెళ్లి చేయరాదని ఆంజనేయపురం సర్పంచి మామిడి కుటుంబరావు అన్నారు. మండలంలోని ఆంజనేయపురం సచివాలయంలో శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మైనర్ బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలు సాధ్యమైనంత వరకు ఉన్నత చదువులు చదవాలని, ప్రేమ పేరుతో మోసగించే వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి శ్రీలత, పంచాయతీ కార్యదర్శి తేనె నరేంద్ర పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో చర్చి ప్రారంభం



మైలవరం: రెడ్డిగూడెంలో నిర్మించిన బేతేలు చర్చిని గాస్పెల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బిషప్ బి.ఏసుపాదం శుక్రవారం ప్రారంభించారు. బిషప్ ఏసుపాదం మాట్లాడుతూ దివంగత దంపతులు ప్రత్తిపాటి ఇస్సాకు, ఎలిజబెత్‌లచే స్థాపించిన సంఘానికి వారి కుమారుడు ప్రత్తిపాటి పాల్ ఇమ్మానియేలు, సుష్మా షారోను దంపతులచే ఒక శాశ్వత మందిరం నిర్మాణం జరిగిందన్నారు. ఈ మందిరం అనేక ఆత్మల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రార్థన మందిరమని చెప్పారు. కార్యక్రమంలో కె. రత్నాకర్, ఆదాం, ఎలీషా, రెవరెండ్ జి. విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

12 మంది బైండోవరు

చాట్రాయి: సారా తయారీ, అమ్మకాలు నిర్వహిస్తున్న 12 మందిని తహసీల్దార్ గీత ఎదుట బైండోవర్ చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్‌ఐ మస్తాన్‌రావు తెలిపారు. గతంలో వీరు ఎక్సైజ్ నేరాలకు పాల్పడ్డారని చెప్పారు.

అకాల వర్షం.. మొక్కజొన్న రైతులకు నష్టం

- మైలవరం మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన మొక్కజొన్నలు
- మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటున్న రైతులు
- సెజ్ ఆంక్షలతో కొనుగోలుకు వెనకాడుతున్న వ్యాపారులు
- మైలవరం నియోజకవర్గంలో 2,023 హెక్టార్లలో మొక్కజొన్న సాగు





మైలవరం మార్కెట్ యార్డులో తడిసిన మొక్కజొన్నలను ఆరబెట్టుకుంటున్న రైతులు (ఇన్‌సెట్) తడిసిన మొక్కజొన్నలను చూపుతున్న రైతు

జి.కొండూరు: గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మైలవరం నియోజకవర్గంలో మొక్కజొన్న రైతులు నష్టపోయారు. ఇప్పటికే కోతలు పూర్తయి రహదారులపైన, కల్లాల్లో అరబోసిన మొక్కజొన్నలు వర్షానికి తడిసిపోయాయి. ముఖ్యంగా మైలవరం మార్కెట్ యార్డులో ఆరబోసిన 80కిపైగా ఎకరాలలో మూడు వేల క్వింటాళ్ల వరకు మొక్కజొన్నలు వర్షానికి తడిసినట్లు రైతులు చెబుతున్నారు. కొందరు రైతులు ఆరిన మొక్కజొన్నలను కుప్పలు చేసి పట్టాలు కప్పగా కుప్పల కిందకు నీరు వెళ్లి అడుగు భాగాన కొంత మేర తడిసింది. మరికొందరు ఆరబోసి అలానే ఉంచడంతో పూర్తిగా తడిసిపోయాయి. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.2,225గా నిర్ణయించిన నేపథ్యంలో వ్యాపారులు రూ.2 వేల నుంచి 2,100 వరకు కొనుగోలు చేస్తున్నారు. అయితే వర్షానికి మొక్కజొన్నలు తడిసిన నేపథ్యంలో వ్యాపారులు కొనేందుకు రారని, ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. నియోజకవర్గంలో పెద్దగా ఈదురుగాలులు లేకుండా వర్షం పడటంతో మామిడితో పాటు మరే ఇతర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లలేదు.

మైలవరం నియోజకవర్గంలో రబీ మొక్కజొన్న సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం
జి.కొండూరు	373.29 హెక్టార్లు
మైలవరం	753.35 హెక్టార్లు
రెడ్డిగూడెం	236.18 హెక్టార్లు
ఇబ్రహీంపట్నం	660.07హెక్టార్లు

సెజ్ ఆంక్షలతో ఆసక్తి చూపని వ్యాపారులు

మైలవరం మార్కెట్ యార్డులో ఆరబోసిన మొక్కజొన్నలను కొనుగోలు చేసిన వ్యాపారులు క్వింటాకు రూ.20.50ను సెజ్ కట్టాలని అధికారులు చెప్పడంతో వ్యాపారులు వెనక్కిపోతున్నారు. లేదంటే ఆరిన తర్వాత మొక్కజొన్నలను మార్కెట్‌యార్డు బయటకు తీసుకొస్తే కొనుగోలు చేస్తామంటున్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు మార్కెట్ యార్డు బయటకు తరలించి విక్రయించుకోగా కొందరు అక్కడే ఉంచారు. దీనితో గురువారం రాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్నలు తడిసి రైతులు నష్టపోయారు.

ఈ ఏడాది నష్టమే



రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగు చేశా. మొక్కజొన్న కోసి మైలవరం మార్కెట్ యార్డులో ఆరబెట్టుకున్నా. శుక్రవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా వర్షం రావడంతో మొక్కజొన్నలు మొత్తం తడిసిపోయాయి. నిన్న సాయంత్రం మార్కెటింగ్ శాఖాధికారులు వచ్చి చూసి వెళ్లారు. కానీ ఏమీ చెప్పలేదు. గతంలో కూడా మొక్కజొన్న ధర లేక నష్టపోయా.

– బండారు వెంకటేశ్వరరావు, పైదపాడు, మైలవరం మండలం

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



చంద్రగూడెం గ్రామంలో రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. వ్యవసాయ ఖర్చులు రూ.లక్ష వరకు అయింది. దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. ధర పలుకుతుందనుకుంటే దళారులు వచ్చి క్వింటాకు రూ.1,800 నుంచి రూ.2 వేలు ఇస్తామంటున్నారు. గురువారం రాత్రి వర్షానికి మొక్కజొన్నలు అడుగుభాగాన తడిచాయి. ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలి.

– మందా రామకృష్ణ, పాత చంద్రగూడెం, మైలవరం మండలం

ఏఎంసీ చైర్మన్‌గా లక్ష్మీ అనిత



తిరువూరు: తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గంపలగూడెంకు చెందిన రేగళ్ల లక్ష్మీ అనిత నియమితులయ్యారు. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ విడుదల చేసిన జాబితాలో లక్ష్మీ అనిత పేరు ఖరారు చేశారు. తిరువూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాలు తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్నాయి.

శ్రీరామ నవమి వేడుకలకు ఏర్పాట్లు



తిరువూరు: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఈ నెల 6న సీతారాముల కల్యాణ వేడుకలకు తిరువూరు నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. తిరువూరు జగన్నాథపురం కాలనీలోని పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయం, కోదండ రామాలయం, రాజుపేట, చీరాల సెంటర్, పాత తిరువూరు ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారామ కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు భక్తబృంద సభ్యులు తెలిపారు. తిరువూరు షిర్డీ సాయి మందిరంలో ఉగాది నుంచి శ్రీ రామనవమి వరకు ఏకనామం, స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం జరుపుతామని కమిటీ సభ్యులు చెప్పారు. గంపలగూడెం, ఊటుకూరు రామాలయాల్లో నవమి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడండి

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరావు

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వ కార్పొరేటీకరణ విధానాలతో నిర్వీర్యమవుతున్న వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన ఇబ్రహీంపట్నంలో జిల్లా స్థాయి రైతు సంఘ సమావేశం శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారుల చేతుల్లో వ్యవసాయం మగ్గిపోతుందన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేకుండా చేసి, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి ప్రభుత్వాలు నెట్టేశాయని చెప్పారు. ఎరువుల సబ్సిడీ ఎత్తివేసి రైతుల నడ్డి విరిచారని విమర్శించారు. వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సహజ ధ్యానంతో ఒత్తిడి దూరం



కోలాటంతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఇబ్రహీంపట్నం: సహజ యోగులందరూ కలిసి వారానికి ఒక రోజు సామూహిక ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చని సహజ యోగా ధ్యాన కేంద్రం రాష్ట్ర కో–ఆర్డినేటర్ కల్లూరి రామకృష్ణ అన్నారు. హెచ్‌హెచ్‌సీ మాతాజీ నిర్మలాదేవి సహజ యోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లా పర్యటనకు ప్రారంభమైన చైతన్య ప్రచార రథయాత్ర శుక్రవారం ఇబ్రహీంపట్నానికి చేరింది. పలువురు భక్తులు కోలాటంతో స్వాగతం పలికారు. యువత ధ్యానం ఆచరించడం వలన మానసిక ఒత్తిడి, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. కన్వీనర్ సుభాషిణి మాట్లాడుతూ 150 దేశాల్లో పౌరులు సహజ ధ్యానం ఆచరిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టినేని వెంకటరావు, దక్షిణాది రాష్ట్రాల కోఆర్డినేటర్ సుధారాణి, జిల్లా కోఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ, వివిధ రాష్ట్రాల కన్వీనర్లు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లా జట్లు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడి గ్రామంలో రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకుని కొటికలపూడి అంబేడ్కర్ యూత్, కృష్ణా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో శుక్రవారం రాత్రి శ్రీకాకుళం, విశాఖపట్నం టీముల మధ్య రసవత్తరంగా పోటీ జరిగింది. ఈ మ్యాచ్‌లో విశాఖపట్నం టీమ్ విజయం సాధించింది. రెండో మ్యాచ్ ప్రకాశం, విజయనగరం జిల్లా జట్ల మధ్య జరిగింది. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాభిమానులు హాజరయ్యారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా టోర్నమెంట్ ఆర్గనైజర్లు బండి వెంకటరావు, చాట్రగడ్డ కోటయ్య, నంబూరి నాని, పర్యవేక్షించారు.

కొనసాగుతున్న నిష్కళంక మాత మహోత్సవాలు



ఉత్సవాల్లో వాక్యోపదేశం చేస్తున్న జోసఫ్ తంబి

ముసునూరు: కథోలిక విశ్వాసుల స్తోత్రగానాలు, దీక్షాధారుల జపమాల ఆరాధనలు, గురువుల దివ్య పూజాబలి అర్పణలతో నెహ్రూ నగర్ ప్రాంతం మార్మోగింది. ముసునూరు విచారణ పరిధిలోని నెహ్రూ నగర్‌లో పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవ. ఫాదర్ జోసఫ్ తంబి ఆధ్వర్యంలో జరుగుతున్న నిష్కళంక మాత మహోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం ఉదయం నుంచే కొండపైన ప్రత్యేక ప్రార్థనలతో కార్యక్రమాలు ప్రారంభించారు. రమణక్కపేట, బుట్టాయగూడెం విచారణకర్తలు విలియమ్, రెవ. జోసఫ్ దివ్య బలిపూజ ఆరాధనలు నిర్వహించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



చిన్నారులతో ఎంఈఓ పుష్పలత తదితరులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్థానిక డాన్ బాస్కో పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. యుకేజీ పూర్తి చేసుకుని మొదటి తరగతికి వెళ్తున్న చిన్నారులకు ఎంఈఓ సీహెచ్ పుష్పలత, కరస్పాండెంట్ జార్జి మెడల్, గ్రాడ్యుయేషన్ పట్టా అందజేశారు. ఎంఈఓ పుష్పలత మాట్లాడుతూ బాల్యంలో చదువుతో పాటు ఆట పాటలకు సమయం కేటాయించాలన్నారు. తరగతి గది చదువులకే కాకుండా వినోదభరితంగా ఉండేలా చూడాలని సూచించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్స్ విజయ్ ప్రకాష్, ఇన్నారెడ్డి సందీప్ రెడ్డి, ఫాదర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగ్జీవన్‌రాం జయంతి

తిరువూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం తిరువూరులో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం జయంతి కార్యక్రమం నిర్వహిస్తామని పార్టీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తెలిపారు. ఉదయం 9 గంటలకు మధిర రోడ్డు సెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రాం కాంస్య విగ్రహానికి నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని చెప్పారు.

కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు



ఆగిరిపల్లి: వివిధ కార్పొరేషన్ల రుణాల ఇంటర్వ్యూలకు 566 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారని ఎంపీడీఓ ఆనంద్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో బ్యాంకు అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 732 మంది దరఖాస్తు చేసుకోగా 566 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని చెప్పారు.

- తిరువూరు: మండలంలోని 10 గ్రామాల పరిధిలో పలు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం తిరువూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 158 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపీడీఓ రవిబాబు తెలిపారు. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ ఏడీబీ శాఖల ఫీల్డ్ అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు.

నూతన బస్సులు ప్రారంభం



నూజివీడు: నూజివీడు డిపోకు వచ్చిన రెండు కొత్త సూపర్ లగ్జరీ అద్దె బస్సులను ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ బస్సులను నూజివీడు నుంచి తిరుపతికి నడుపుతామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ ప్రాంతం నుంచి తిరుపతికి నడుపుతున్న బస్సు సర్వీసులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో నూజివీడు డిపో నుంచి దూరప్రాంతాలకు మరిన్ని సర్వీసు లు నడిపేందుకు కృషి చేస్తామన్నారు.డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణను నిరసిస్తూ కరపత్రాల పంపిణీ



తిరువూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తిరువూరు: మైనారిటీల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణలు చేయడాన్ని నిరసిస్తూ తిరువూరులో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక జామియా మసీదు వద్ద సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ మేకల నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ హిందూత్వ మతోన్మాద అజెండా అమలులో భాగంగా ముస్లింలపై విద్వేషంతో పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. లవ్ జీహాద్ ఘర్ వాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం, మూక హత్యలతో బీజేపీ తన వైఖరి స్పష్టం చేసిందని విమర్శించారు. ఇప్పుడు వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింల ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై కూడా పెత్తనం చెలాయించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఇటువంటి దుర్మార్గాలను అడ్డుకోవాలని కోరారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు పలికి టీడీపీ, జనసేన లౌకికత్వానికి విఘాతం కలిగించాయని, లౌకికవాదులు ఈ పార్టీల వైఖరిని గమనించాలని కోరారు. సీపీఎం నాయకులు బలగాని వెంకటేశ్వరరావు, ఆకుల రవి, పంతంగి శ్రీనివాసరావులు, షేక్ సత్తార్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

కొండపల్లిలో ముస్లింల నిరసన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ముస్లింల హక్కులు హరించేలా వక్ఫ్ బిల్లు సవరణ చేపట్టడంపై సీపీఎం ఆధ్వర్యంలో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. కొండపల్లి మోషాయిక్ మసీదు వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బిల్లు సవరణలతో ముస్లిం సామాజిక వర్గానికి జరిగే నష్టాన్ని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఎం పట్టణ అధ్యక్షుడు ఎం.మహేష్, మసీదు కమిటీ సభ్యుడు ఎస్‌కే బాషా మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింల ధార్మిక, సామాజిక సంస్థల ఆస్తులపై దాడులకు తలపెట్టిందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు బిల్లుకు ఆమోదం తెలిపి లౌకికవాదానికి విఘాతం కలిగించాయని విమర్శించారు. సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా చట్టం చేయడం దుర్మార్గమన్నారు. పలువురు ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

7న స్వయం ఉపాధి పథకాలకు ఇంటర్వ్యూలు

తిరువూరు: బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 7న తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కమిషనర్ లోవరాజు తెలిపారు. తిరువూరు భారతీయ స్టేట్ బ్యాంకు మెయిన్, ఇండియన్ బ్యాంకు, ఎస్‌బీఐ ఏడీబీ రాజుపేట, యూనియన్ బ్యాంక్‌ల మేనేజర్లు, ఫీల్డ్ అధికారులు ఉదయం 10 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలలో అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

8న ఇంటర్వ్యూలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని బీసీ, ఈబీసీ, కమ్మ, వైశ్య కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 8న ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ సునీత శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, కుల, నివాస ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో రెండు జతల అప్లికేషన్ ఫారాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

ఎమ్మెల్యేపై చర్యలకు పార్టీ అధిష్టానానికి కేడర్ డిమాండ్

తిరువూరు: ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తమకు వద్దంటూ టీడీపీ నాయకులు ఆపార్టీ అధిష్టానానికి మొర పెట్టుకున్నారు. గురువారం రాత్రి తిరువూరులో సమావేశమై ఎమ్మెల్యే పనితీరుపై బాహాటంగా విమర్శించారు. ఎమ్మెల్యేకు ఉన్న అధికారాలు కట్టడి చేసి పార్టీ ఇన్‌చార్జిగా మరొకరిని నియమించాలని కోరారు. నియోజకవర్గంలో 20 ఏళ్ల తర్వాత పార్టీ గెలిచిందనే సంతోషం లేకుండా పోయిందని, ఎమ్మెల్యే వైఖరితో కేడర్ నిస్తేజానికి గురైందని వాపోయారు. సకాలంలో సరైన చర్య తీసుకోకపోతే పార్టీ పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ సీనియర్ నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు, సుంకర కృష్ణమోహన్, గద్దె వెంకటేశ్వరరావు, తాళ్ళూరి రామారావు, బొమ్మసాని ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమతా దినోత్సవం

గానుగపాడు(తిరువూరురూరల్): గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సమతా దినోత్సవం నిర్వహించారు. మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రాం చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రాం జీవిత విశేషాలను ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి వివరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, రాంప్రదీప రామారావు, సుదర్శన్, సాంబశివరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

తిరువూరు: లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు, వక్ఫ్ బోర్డ్ ఆస్తుల చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న తిరువూరు పాత బస్టాండు సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగుల్‌మీరా తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు.

ఉద్యోగాలకు 58 మంది ఎంపిక



మైలవరం: డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ ఫెస్ట్ నిర్వహించారు. 21 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి 160 మంది హాజరుకాగా తొలి విడతగా 58 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ద్వారా నియామక పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. వెంకటాద్రి పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిపిన దాడుల్లో సారాకు సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎ.కొండూరు మండలం గొల్లమండల తండాలో సారా బట్టీ వద్ద బెల్లపు ఊటను గుర్తించామన్నారు. బట్టీ ఏర్పాటు చేసిన స్థలం బుడిపూడి యాకూబ్‌దిగా గుర్తించి అతనిపై కేసు నమోదు చేశామని చెప్పారు.